

మూసీ పరీవాహక ప్రాంతంలోని న్యూ మారుతీనగర్‌లో వంటావార్పుతో నిరసన తెలుపుతున్న నిర్వాసితులు


# నమస్తే తెలంగాణ
# వికారాబాద్

I | హైదరాబాద్, సోమవారం 30 సెప్టెంబర్ 2024 | VIKARABAD





హైదర్షాకోట్‌లో మా ఇండ్లను కూల్చొద్దంటూ..ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్న చిన్నారులు

‘మూసీలో పేదల కన్నీళ్లు పారుతున్నాయి.. పేకమేడల్లా కూల్చేందుకు కాంగ్రెస్ చేస్తున్న పన్నాగాలతో గుండెలు కరిగిపోతున్నాయి.. ఆర్తనాదాలు, ఆక్రందనలను చేస్తున్నా.. బండ లాంటి గుండె కలిగిన రేవంత్‌రెడ్డి మాత్రం కనికరం చూపడం లేదు.. అని మాజీ మంత్రి హరీశ్‌రావు అసహనం వ్యక్తం చేశారు. హైడ్రా బాధితులకు బీఆర్‌ఎస్ అండగా ఉంటుంది’ అని అభయమిచ్చారు. ‘మీ ఇండ్లపై బుల్డోజర్లు రావాలంటే... ముందు మమ్మల్ని దాటుకుని పోయేలా.. బీఆర్‌ఎస్ రక్షణ కవచంలా నిలబడుతుంది’ అని ధైర్యం చెప్పారు. ఆదివారం హైదర్షాకోట్, లంగర్‌హౌస్ సమీపంలోని మూసీ పరీవాహక ప్రాంతాల్లో బీఆర్‌ఎస్ నేతలు పర్యటించారు. బాధితుల గోడు విన్న హరీశ్‌రావు..‘మీ బాధ చూస్తుంటే కండ్లలో నీళ్లు తిరుగుతున్నాయి. మీ బాధలు వింటే.. రాతి గుండె కూడా కరిగిపోవాల్సిందే. కానీ రేవంత్ గుండె ఎందుకు కరగడం లేదో నాకైతే అర్థం కావడం లేదు’.. అని అన్నారు.

– సిటీబ్యూరో/మైలార్‌దేవ్‌పల్లి, సెప్టెంబర్ 29 (నమస్తే తెలంగాణ)




హైదర్షాకోట్‌లో హైడ్రా బాధితులతో కలిసి నిరసన తెలుపుతున్న మాజీ మంత్రులు హరీశ్‌రావు, సబితాఇంద్రారెడ్డి, బీఆర్‌ఎస్ నేతలు

### రేవంత్.. ముందు నీ ఇంటిని కూలగొట్టు

గుండెలు బాదుకుంటున్న వినకుండా బుల్డోజర్లతో ఇండ్లు కూల్చివేస్తున్న రేవంత్‌రెడ్డి... సొంతిల్లు కూడా చెరువు భూములోనే ఉందని హరీశ్‌రావు అన్నారు. కొడంగల్‌లోని రెడ్డికుంటలో ఉందని, దుర్గం చెరువు ఎఫ్‌టీఎల్‌లో రేవంత్ సోదరుడి సొంతిల్లు కూడా ఉన్నదని, ముందుగా ఆ రెండింటిని కూల్చివేసి, ఆ తర్వాత పేదల ఇండ్లపైకి రావాలన్నారు. అధికారం ఉందని సోదరుడికో రూల్, పేదలకో రూల్ పాటించాల్సిన అవసరమేంటని ప్రశ్నించారు. ఐదేండ్లు పాలించమని అధికారం అప్పగిస్తే... పేదలకు జీవితకాలం పాటు ఉండే ఇండ్లను సీఎం రేవంత్‌రెడ్డి కూల్చివేస్తున్నారని మండిపడ్డారు.

### బీఆర్‌ఎస్ తలుపులు తెరిచే ఉంటాయి

‘మీకు ఇబ్బంది వస్తే 24 గంటలు తెరిచి ఉండే తెలంగాణ భవన్‌కు రావాలి..అర్ధరాత్రి వచ్చినా.. ఆశ్రయమిస్తాం..అత్యవసరమైతే ఫోన్ చేయాలి..అరగంటలో గులాబీ దండు మీ ముందు ఉంటుంది’.. అని బాధితులకు హరీశ్‌రావు అభయమిచ్చారు. సంక్షేమ పథకాలు అమలు చేసేందుకు పైసలు లేవంటున్న రేవంత్ రెడ్డి... మూసీ సుందరీకరణకు లక్షన్నర కోట్లను ఎక్కడి నుంచి తీసుకొస్తారని ప్రశ్నించారు. నగరాన్ని వరదలు ముంచెత్తినా... నిజాం రాజు కూడా వరదలు వచ్చినట్లుగా ఇండ్లు కూలగొట్టలేదని, కానీ రేవంత్ వరదల పేరిట దారుణంగా వ్యవహరిస్తున్నారన్నారు. మూసీ సుందరీకరణ మానుకొని.. బాధితులకు రేవంత్ భరోసా ఇవ్వాలని సూచించారు. ‘మీ ఇండ్లపైకి దూసుకువచ్చే బుల్డోజర్లకు అడ్డుగా తన కొడుకు కార్తిక్‌రెడ్డిని నిలబెడతానం’టూ మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి బాధితులకు ధైర్యం చెప్పారు.

# మేమున్నాం..అధైర్యపడొద్దు..!

**రక్షణ కవచంలా నిలబడుతాం • మూసీ నిర్వాసితులకు బీఆర్‌ఎస్ నేతల అభయం • హైదర్షాకోట్, లంగర్‌హౌస్ పరీవాహక ప్రాంతాల్లో పర్యటన**

హైదర్షాకోట్, లంగర్‌హౌస్ సమీపంలోని మూసీ పరీవాహక ప్రాంతాల్లో మాజీ మంత్రులు హరీశ్‌రావు, సబితాఇంద్రారెడ్డి, మహమూద్ అలీ, గంగుల కమలాకర్‌తో పాటు బీఆర్‌ఎస్ నేతలు పర్యటించారు. పేదల బతుకులను ఛిద్రమేస్తున్న కాంగ్రెస్‌ను ఎదుర్కొనేందుకు బీఆర్‌ఎస్ నాయకులు వస్తున్నారని తెలిసి సుమారు 5వేల మంది బాధితులు తరలివచ్చారు. తమ గూడును కూల్చేస్తామంటున్న రేవంత్ సర్కార్‌ను నిలువరించాలని వేడుకున్నారు. నిర్వాసితులకు ధైర్యం చెప్పి..అండగా ఉంటామని భరోసా ఇచ్చిన బీఆర్‌ఎస్ నేతలు.. ప్రభుత్వం దిగివచ్చేవరకు బాధితుల పక్షాన నిలబడుతామని స్పష్టం చేశారు. హైదర్‌షాకోట్, లంగర్‌హౌస్ సమీపంలో ఉన్న పలు కాలనీవాసులతో మాట్లాడిన హరీశ్‌రావు.. ఇందిరమ్మ పాలనలో పేదలకు కూడు, గూడు, గుడ్డ ఇవ్వాల్సింది పోయి... పేదల ఇండ్లను కూల్చేస్తున్నారంటూ మండిపడ్డారు. ‘మీరు అధైర్యపడొద్దు, ప్రాణాలు తీసుకోవద్దు. తెలంగాణలో ఇందిరమ్మ పాలన పోయి... బుల్డోజర్ల రాజ్యం నడుస్తోంది’ అని ఆగ్రహం వ్యక్తం చేశారు.

### భారీగా తరలి వచ్చిన జనం..

మూసీ నిర్వాసితుల పక్షాన బీఆర్‌ఎస్ నిలుస్తూ చేపట్టిన సంఘీభావ పర్యటనలో తమ సొంతింటిని కోల్పోతున్న వేలాది మంది జనాలు తరలి వచ్చారు. బిక్కుబిక్కుమంటూ హైడ్రా భయంతో బతుకీడుస్తున్నామని.. గుండెలు బాదుకుంటూ తమ ఆవేదనను బీఆర్‌ఎస్ శ్రేణులకు తెలిపారు. బీఆర్‌ఎస్ పేదల పక్షాన నిలిస్తుందని..నిర్వాసితులకు న్యాయస్థానాల ద్వారానైనా న్యాయం జరిగేలా చూస్తామని ఆ పార్టీ నేతలు స్పష్టం చేశారు.

**రేవంత్... నీ గుండె కరిగేదెప్పుడూ ?**

**మూసీలో పేదల కన్నీళ్లు పారుతున్నాయి**

**ఇందిరమ్మ పాలనపోయి..బుల్డోజర్ల రాజ్యం**

**మాజీ మంత్రి హరీశ్‌రావు మండిపాటు**

**ఏ కష్టమొచ్చినా తెలంగాణ భవన్‌కు రావాలని బాధితులకు అభయం**

**అర్ధరాత్రి వచ్చినా ఆశ్రయమిస్తామని భరోసా**



### మా స్నేహాన్ని విడదీయవద్దు

నా స్నేహితురాలు హైదర్షాకోట్ ప్రాంతంలో ఉంటుంది. కొన్ని రోజులుగా ఆమె స్కూల్‌కు రావడం లేదు. ఏమైందని ఆమెను అడిగితే మొన్న మా ఇంటికి పోలీసులు, అధికారులు వచ్చారు.. మా ఇంటిని కూల్చి వేస్తామని చెబుతున్నారు. ఇంటిని ఖాళీ చేసి ఇతర ప్రాంతాలకు వెళ్లాలని బలవంతం చేయడంతో మమ్మి, డాడీ ఏమి చేయాలో తెలియక ఇంట్లో ఏడుస్తూ ఉండిపోతున్నారు. మా ఇంటిని కూల్చేస్తే మేము ఇక్కడ ఉండం.. ఇతర ప్రాంతానికి వెళ్లిపోతాం అని రోదిస్తున్నది. మూసీ పరీవాహక ప్రాంతం నుంచి కాకుండా అధికారులు కావాలనే మార్కింగ్‌ను తప్పుగా చేస్తున్నారు. సీఎం సార్ మా స్నేహితురాలి ఇంటిని కూలిస్తే తను స్కూల్‌కు రాదు. ఇతర ప్రాంతానికి వెళ్లిపోతుంది. మా స్నేహాన్ని వీడదీయవద్దు సారూ. – రోహిణి, ఆరో తరగతి, హైదర్షాకోట్

### సీఎం భయభ్రాంతులకు గురి చేస్తున్నారు




సీఎం అంటే ప్రజలకు మంచి చేయాలని చూస్తారు.. కానీ ఇలా ఇబ్బందులు పెట్టాలని చూసే సీఎంను ఇప్పటి వరకు చూడలేదు. డెవలప్‌మెంట్ అనే పేరును చూపుతూ ప్రజలను భయభ్రాంతులకు గురి చేయడం సరైన పద్ధతి కాదు. మేము నివసించే ఇండ్లు బఫర్ జోన్‌లో ఉంటే ఏ విధంగా పన్నులు కట్టించుకున్నారో మాకు చెప్పాలి. ఇన్ని రోజులు లేని అన్యాయం ఇప్పుడే ఎలా జరుగుతుంది. మేము ఈ ప్రాంతంలో తీసుకున్న ప్రతి దస్తావేజు మా వద్ద ఉన్నాయి. ఎలా ఇవి అక్రమ నిర్మాణాలవుతాయో అధికారులే సమాధానం చెప్పాలి.

– కృష్ణ, గంధంగూడ, కె.కె.నగర్, ఫేస్–2



### ప్రజల గోడు వినేదెవరూ?

మార్కింగ్ చేసే సమయంలో మేము చెప్పే ఏ ఒక్క విషయాన్ని కూడా అధికారులు వినిపించుకోవడం లేదు. కేవలం వారు ఏదో చెబుతున్నారు.. వెళ్లిపోతున్నారు తప్ప.. ప్రజలు ఏదో చెప్పాలనుకుంటున్నారు వారి సమస్య ఏమిటిని అని వినే నాథుడే కరవయ్యారు. వారు ఏదీ చేసినా.. చెల్లుతుందని అనుకుంటున్నారు. కానీ వారి ఆగడాలను సాగనివ్వం. ఎంత మంది వచ్చినా వారిని ప్రతిఘటించేందుకు అందరం కలిసికట్టుగా పోరాడుతాం తప్ప..మా ఇండ్లను వదులుకునే ప్రసక్తే లేదు. – శ్రీనివాస్, విఘ్నేశ్వర కాలనీ.

### ఇన్నాళ్లూ ఎలా బిల్లు కట్టించుకున్నారు..




మేము ఆక్రమించుకున్న స్థలం బఫర్ జోన్, ఎఫ్‌టీఎల్‌లో ఉంటే ఏ విధంగా కరెంటు, నల్లా బిల్లు వస్తుంది. పన్నులు ఏ విధంగా కట్టించుకున్నారు. ఏ విధంగా మా ఇంటికి పర్మిషన్ ఇచ్చారు. ఏ విధంగా రిజిస్ట్రేషన్ చేశారు. ఇన్ని సంవత్సరాలుగా మేము ఉంటూ ప్రభుత్వానికి అన్ని విధాలా బిల్లులు చెల్లిస్తున్నాం. మా వద్ద అన్ని దస్తావేజులు భద్రంగా ఉన్నాయి. ప్రభుత్వమే కదా మేము చెల్లించిన బిల్లులకు రసీదులు ఇచ్చింది. మాది తప్పు అయినప్పుడు ప్రభుత్వ అధికారులు మాకు ఇవన్నీ ఎలా ఇచ్చారు. అలాంటప్పుడు ప్రభుత్వ అధికారులపై చర్యలు తీసుకోవాలి.. పేద ప్రజలపై కాదు.

– రఘునాథ్ తివారీ, కె.కె.నగర్ కాలనీ, హైదర్షాకోట్.



### పైసా పైసా కూడబెట్టి ..

మూసీ ఎక్కడో ఉంది.. మా ఇండ్లు మరెక్కడో ఉన్నాయి.. మేము ఏదో కూలీ నాలీ చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాం. రూపాయి రూపాయి కూడబెట్టుకొని స్థలాన్ని కొనుగోలు చేశాం. అలాగే డబ్బులు జమ చేసుకొని ఇంటిని నిర్మించుకున్నాం. అధికారులు వచ్చి మీ ఇండ్లు అక్రమ నిర్మాణమని చెబుతుంటే గుండెలు ఆగిపోయే పరిస్థితి వస్తున్నది. – బిందు, హైదర్షాకోట్.

### వెళ్లం..ఇక్కడే ఉంటాం..



అనేక సంవత్సరాలుగా ఈ ప్రాంతంలో నివాసాలు ఏర్పాటు చేసుకొని జీవిస్తుంటే వీటిని కూలగొట్టి మమ్మల్ని ఇతర ప్రాంతాలకు తరలించేందుకు ప్రభుత్వం కుట్రలు చేస్తున్నది. ఏదో పని చేసుకుంటూ మా పిల్లలను ఇక్కడ చదివించుకుంటూ సిటీని నమ్ముకొని బతుకుతున్నాము. సదుపాయాలు లేని ప్రాంతాల్లో డబుల్ బెడ్రూం ఇండ్లు ఇస్తే మేము ఎందుకు పోతాము. కష్టపడి నిర్మించుకున్న ఇంట్లోనే ఉంటాం. – శిరీష, విఘ్నేశ్వర కాలనీ.



### కష్టపడి ఇల్లు కట్టుకున్నాం..

జీవిత కాలం కష్టపడితే కానీ మా ఇంటి నిర్మాణం పూర్తి కాలేదు. అలాంటి ఒక రాత్రిలో ఇది అక్రమ నిర్మాణం, బఫర్ జోన్‌లో ఉంది, ఎఫ్‌టీఎల్‌లో ఉంది అని చెప్పడం సరికాదు. సీఎం పదవి అంటే ఐదేండ్లకు ఒకసారి మారుతుంది. కానీ మేము నివసించే ఇల్లు మా ప్రాణం పోయేంత వరకు ఉంటుంది. ఇంటిని ఖాళీ చేసే ప్రసక్తే లేదు. – తేజస్వినీ కె.కె.నగర్.

# అష్టవంకర్లు..

**రూ. 32,237 కోట్లతో రెండో దశ మెట్రో**

**జల్‌పల్లి మీదుగా వెళ్లే ఎయిర్‌పోర్టు మార్గం రద్దు**

**అలైన్‌మెంట్‌లో మార్పులు...**

**ఒక వైపు నుంచే విమానాశ్రయంలోకి..**

**ఆరాంఘర్- కొత్త హైకోర్టు మీదుగా రూట్**

**అక్కడి నుంచి ఫోర్త్ సిటీ దాకా పొడిగింపు**


**ఎయిర్‌పోర్టు కారిడార్‌లో భూగర్భ మార్గం**

**ఫోర్త్‌సిటీ మెట్రో ప్రాజెక్టు కలిపి డీపీఆర్‌ల రూపకల్పన**

**కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల జాయింట్ వెంచర్ ప్రాజెక్టుగా ప్రతిపాదన**

**116 కి.మీ పెరిగిన మెట్రో మార్గం**

సిటీబ్యూరో : మెట్రో రెండో దశ అష్టవంకర్లు తిరుగుతున్నది. మొన్న 70 కి.మీ... నిన్న 78 కి.మీ... నేడు 116 కి.మీతో రెండో దశ ప్రాజెక్టుకు అధికారులు డీపీఆర్‌లను సిద్ధం చేస్తున్నారు. ఇంకా ప్రతిపాదనల దశలోనే ఉన్న మెట్రో మార్గాలను కాంగ్రెస్ సర్కారు ఇలా అటు... ఇటు తిప్పుతూ..మార్పులు చేర్పులు చేస్తున్నది. పైగా అంచనాలు అమాంతం పెరుగుతున్నాయి. మొన్నటి వరకు రూ.20వేల కోట్ల వ్యయం అవుతుందని అంచనా వేసిన మెట్రో అధికారులు.. తాజాగా రూ.32237 కోట్ల వ్యయం అవుతుందంటూ ప్రతిపాదనలు చేశారు. అలాగే ఎయిర్‌పోర్టు మెట్రో అలైన్‌మెంట్ మార్చారు. ఆరాంఘర్–బెంగళూరు హైవే, కొత్త హైకోర్టు మీదుగా విమానాశ్రయానికి మెట్రో లైనును ప్రతిపాదించారు. ఎయిర్‌పోర్టు కారిడార్‌లో 1.6 కిలోమీటర్ల మేర మెట్రో రైలు భూగర్భ మార్గంలో నిర్మించనున్నారు. విమానాశ్రయం లోపలికి ఒకవైపు నుంచే మార్గాన్ని నిర్మించనున్నారు. పైగా రెండో దశలోనే ఫోర్త్ సిటీకి రైలు మార్గం ప్రతిపాదన చేర్చారు. నగరమే లేని చోటుకు ఇప్పుడే మెట్రో మార్గం ఏమిటంటూ.. పలువురు విమర్శిస్తున్నారు. కేసీఆర్ ప్రభుత్వం మహానగరంలో ఉన్న ట్రాఫిక్ సమస్యలకు చక్కని పరిష్కారాలు చూపుతూ మెట్రో మార్గాలను ప్రతిపాదిస్తే.. వాటిని రేవంత్ సర్కారు రద్దు చేసింది.ఇప్పటికిప్పుడు అవసరమైన చోట మెట్రో ప్రాజెక్టును యుద్ధ ప్రాతిపదికన చేపట్టాల్సిన ఉన్నా.. దాన్ని పరిగణనలోకి తీసుకోలేదు. సీఎం రేవంత్ తన కలల ప్రాజెక్టుగా చెప్పుకుంటున్న ఫోర్త్ సిటీ కోసం 7 మార్గాల మెట్రో డీపీఆర్‌లను ఇప్పటికీ పూర్తి చేయించలేదు. అయినా.. రెండో దశలోనే ఫోర్త్ మెట్రో రైలు మార్గం ప్రతిపాదన చేర్చడంపై నగరవాసులు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. కాగా, ఆదివారం హైదరాబాద్ మెట్రో రైలు ఎండీ ఎన్వీఎస్‌రెడ్డి రెండో దశ మెట్రో ప్రాజెక్టుకు సంబంధించిన వివరాలను మీడియాకు వెల్లడించారు. ఇప్పటికే ఉన్న మూడు కారిడార్లను పొడిగిస్తూ.. కొత్తగా ఆరు కారిడార్లను నిర్మిస్తున్నట్లు చెప్పారు.




### జల్‌పల్లి మీదుగా రద్దు...

తొలుత ప్రభుత్వం రెండో దశలో నాగోల్ నుంచి ఎల్బీనగర్, చాంద్రాయణగుట్ట, మైలార్‌దేవ్‌పల్లి, జల్‌పల్లి మీదుగా ఎయిర్‌పోర్టు లోపలికి మెట్రో మార్గాన్ని నిర్మిస్తామని ప్రకటించింది. గత 4–5 నెలలుగా డీపీఆర్‌పై కసరత్తు చేసిన తర్వాత, ఫోర్త్ సిటీకి ప్రాధాన్యతనిస్తూ గతంలో ప్రతిపాదించిన మార్గాల్లో మార్పులు చేశారు. మైలార్‌దేవ్‌పల్లి నుంచి జల్‌పల్లి , పీ7 రోడ్డు, మామిడిపల్లి మీదుగా వెళ్లాల్సిన మెట్రో మార్గాన్ని రద్దు చేశారు. నాగోల్ నుంచి వచ్చే మార్గాన్ని ఇన్నర్ రింగు రోడ్డు మీదుగా ఆరాంఘర్ వరకు, అక్కడి కొత్త హైకోర్టు ముందు నుంచి శంషాబాద్ టౌన్, బెంగళూరు జాతీయ రహదారి మీదుగా ఎయిర్‌పోర్టు లోపలి వరకు ఒక మార్గాన్ని ప్రతిపాదించారు.

### ఒకవైపు నుంచే..

కేసీఆర్ ప్రభుత్వం శంషాబాద్ ఎయిర్‌పోర్టు లోపలికి హైదరాబాద్–బెంగళూరు జాతీయ రహదారి వైపు నుంచే రైడర్‌షిప్ (ప్రయాణికుల రద్దీ పరంగా) అధికంగా ఉంటుందని మెట్రో మార్గాలను ప్రతిపాదించింది. వాటిని రద్దు చేసినట్లు ప్రకటించడమే కాకుండా తక్కువ దూరంతో నగరం నుంచి ఎయిర్‌పోర్టు లోపలికి మెట్రో రైలును తీసుకెళ్తున్నామని ఎంతో గొప్పగా సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించారు. మళ్లీ కాంగ్రెస్ సర్కారు తన నిర్ణయాన్ని మార్చుకొని.. గత ప్రభుత్వం ప్రతిపాదించిన మార్గంలోనే రూట్లను ఖరారు చేస్తున్నది. ఓఆర్ఆర్ ఇంటర్‌చేంజ్ నుంచి కొంగరకలాన్ వరకు తీసుకెళ్లి అక్కడి నుంచి ఫోర్త్ సిటీ కోసం కొత్తగా నిర్మించే 300 అడుగుల గ్రీన్ ఫీల్డ్ రోడ్డు మార్గంలో లైన్‌ను నిర్మించాలని నిర్ణయించారు.

### రూ. 32,237 కోట్లతో రెండో దశ మెట్రో...

రెండో దశలో చేపడుతున్న మెట్రో ప్రాజెక్టు అంచనాలు అమాంతం పెరుగుతున్నాయి. మొన్నటి వరకు రూ. 20వేల కోట్ల వ్యయం అవుతుందని అంచనా వేసిన అధికారులు, తాజాగా రూ.32,237 కోట్ల వ్యయం అవుతుందంటూ ప్రతిపాదనలు సిద్ధం చేశారు. సీఎం ప్రత్యేక దృష్టి సారించిన ఫోర్త్ సిటీ మెట్రో కనెక్టివిటీ కోసం అనేక ఆకర్షణీయమైన ఫీచర్లతో వినూత్న రీతిలో డీపీఆర్ తయారు చేస్తున్నామని, ఫోర్త్ సిటీ మెట్రో మార్గమైన 40 కి.మీ కోసం రూ. 8వేల కోట్ల వ్యయమవుతుందని మెట్రో అధికారులు వెల్లడించారు. రెండో దశలోని ఇతర కారిడార్లను కలుపుకొని మొత్తం రెండో దశలో చేపట్టే 116 కి.మీ కారిడార్ల నిర్మాణానికి ఒకేసారి రూ.32,237 కోట్లుగా అంచనా వేశామన్నారు. దేశంలోని ఇతర నగరాల్లో చేపట్టిన మెట్రో రైలు ప్రాజెక్టుల తరహాలోనే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల జాయింట్ వెంచర్‌గా ఈ ప్రాజెక్టును అమలు చేసేలా ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నామన్నారు.

### 1.6 కి.మీతో..భూగర్భ మార్గం...

ఇప్పటికే ఉన్న మూడు మెట్రో కారిడార్‌లను పొడిగిస్తూ కొత్తగా 6 కారిడార్లను నిర్మిస్తున్నారు. ఇందుకోసం హెచ్ఎండీఏ హైదరాబాద్ మెట్రోపాలిటన్ ఏరియా కోసం సిద్ధం చేస్తున్న కాంప్రహెన్సివ్ మొబిలిటీ ప్లాన్ (సీఎంపీ) ట్రాఫిక్ అధ్యయన నివేదిక కోసం ఎదురు చూస్తున్నట్లు మెట్రో ఎండీ ఎన్వీఎస్ రెడ్డి తెలిపారు. ప్రతిపాదిత మెట్రో మార్గాల్లో ట్రాఫిక్ అంచనాలను సీఎంపీతో క్రాస్ చెక్ చేయాల్సి ఉంటుందని, దీన్ని పూర్తి చేసిన తర్వాతే తుది డీపీఆర్‌ను రూపొందించి రాష్ట్ర ప్రభుత్వానికి సమర్పిస్తామని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం ఆమోదం పొందిన తర్వాత కేంద్రప్రభుత్వ అనుమతుల కోసం వెళ్తామన్నారు. కారిడార్–4లో ప్రతిపాదించిన 36.6 కి.మీ మెట్రో మార్గంలో ఎలివేటెడ్ కారిడార్ 35 కి.మీ మేర ఉంటే, మిగతా 1.6 కి.మీ దూరం భూగర్భంలో నిర్మించనున్నామని, ఎయిర్‌పోర్టు టర్మినల్ వద్దకు వెళ్లేందుకు వీలుగా భూగర్భంలోంచి మార్గాన్ని నిర్మించేలా డీపీఆర్‌ను సిద్ధం చేస్తున్నట్లు ఎండీ చెప్పారు.